క్లుప్తంగా

ఆ వ్యాపారులను హాకర్ జోన్‌కు తరలించండి



గుల్లలపాలెం మార్కెట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని మార్కెట్‌ను ఎమ్మెల్యే పి.గణబాబు సోమవారం సాయంత్రం సందర్శించారు. కొందరు సేవా మార్గం, ఫుట్‌పాత్‌పై దుకాణాలు నిర్వహించడంతో తమకు ఇబ్బందిగా ఉందని అద్దె చెల్లిస్తున్న దుకాణాల యజమానులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీని ఎమ్మెల్యే స్పందిస్తూ సర్వీసురోడ్డులో తాత్కాలికంగా దుకాణాలు నిర్వహిస్తున్న వారిని హాకర్ జోన్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. అద్దె చెల్లిస్తూ వ్యాపారాలు చేస్తున్న వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో వ్యర్థాలతో నిండిపోయిన నేలబావిని మూసి వేయాలన్నారు. వ్యాపారులకు ఉపయోపడే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట జెడ్సీ బి.రాము, అధికారులు, నాయకులు ఉన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ చెప్పారు. వార్డు పరిధిలోని సుసర్ల కాలనీ వంశీ సూపర్ మార్కెట్ నుంచి జాతీయ రహదారి వరకు ఉన్న సీసీ డ్రైను అభివృద్ధి పనులకు సోమవారం స్థానికులతో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. డ్రైన్ల నిర్మాణం అవసరాన్ని గుర్తించి జీవీఎంసీ ద్వారా రూ.52.60 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ ఏఈ వెంకటలక్ష్మి, సీతారామరాజు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సుసర్ల కాలనీ ప్రతినిధులు అజయ్, నాగేంద్ర కుమార్, భరత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గణబాబుకు అభినందన

సింధియా: ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్యే గణబాబును సోమవారం ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్ పలువురు బీజేపీ నాయకులతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు యల్లబిల్లి వెంకటరావు, రామకృష్ణ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

విశాఖ విద్య: ఎన్ఏడీ యాజమాన్యం మొండి వైఖరి విడనాడి సస్పెండ్ చేసిన 36 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నేవల్ ఆర్మమెంట్ డిపో(ఎన్ఏడీ) యాజమాన్యం, సీజీఎం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న నిరంకుశ ధోరణిని విడనాడాలని కోరుతూ సోమవారం ఎన్ఏడీ మెయిన్ గేట్ వద్ద సీఈ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సస్పెండ్ చేసిన 36 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. యూనియన్ నాయకులను సస్పెండ్ చేసి ఉద్యమాలను దెబ్బకొట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. సీజీఎం మొండి వైఖరి నశించాలి, 36 మంది సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలి, సీజీఎం డౌన్ డౌన్ అంటూ ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇరుకు గదులు.. ఆరుబయట భోజనాలు

ఆ పాఠశాల చరిత ఎంతో ఘనం.. స్వాతంత్ర్యానికి ముందు ఏర్పడిన ఆ పాఠశాల ఎంతో మంది సరస్వతీపుత్రులను అందించింది. ఓ వెలుగు వెలిగింది. నేడు వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయో అని ఎదురు చూస్తున్నారు.

– మల్కాపురం

- క్రీడా మైదానం లేక ఇబ్బందులు
- శ్రీహరిపురం మోడల్ స్కూల్‌ను వేధిస్తున్న సమస్యలు
- గదులు సరిపోక ఉదయం ప్రైమరీ, మధ్యాహ్నం హైస్కూల్ నిర్వహణ



పాఠశాల మెట్లపై కూర్చుని భోజనాలు చేస్తున్న విద్యార్థులు

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం మెయిన్ రోడ్డుకు ఆనుకుని 1947కు ముందు ఐదుగదులతో పాఠశాల ఏర్పాటు చేశారు. నాడు ఒకటి నుంచి ఐదోతరగతి వరకు ఇక్కడే విద్యార్థులు చదువుకునే వారు.1996లో ఈ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఒకటి నుంచి పదో తరగతి వరకూ నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో



పాఠశాల వరండాలో భోజనం చేస్తున్న విద్యార్థులు



ఇరుకు గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

వసతులు లేక అవస్థలు

చరిత్ర గల ఈ పాఠశాలలో నేటికీ లైబ్రరీ లేదు.విద్యార్థులు భోజనాలు చేసేందుకు డైనింగ్ హాల్ ,పిల్లలు ఆడుకోవడానికి మైదానం లేవు. ఉపాధ్యాయుల కోసం స్టాఫ్ రూమ్ లేక ఇబ్బందులు పడుతున్నారు.

తరగతి గదులు సరిపోక ఆరుబయట తరగతులు నిర్వహించేవారు.

సమస్యను గుర్తించిన అధికారులు ఒకటి నుంచి ఐదో తరగతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, ఆరు నుంచి పదో తరగతి వరకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 860 మంది విద్యార్థులు చదువుతున్నారు. 25 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. కేవలం 10 తరగతి గదులే ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

సమయం పెంచితే ఇబ్బందులు

ఇది ఇలా ఉంటే ప్రస్తుతం ఉన్నత పాఠశాలను సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగించనున్నారు. పాఠశాల విడిచిపెట్టే సమయంలో పలు పరిశ్రమల కార్మికులు విధుల నుంచి వస్తారు. పాఠశాల మెయిన్‌రోడ్డుపై ఉండడంతో విద్యార్థులు రోడ్డు దాటలేక ఇబ్బందులు తలెత్తుతాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు పాలకులు,అధికారులను ప్రశ్నిస్తున్నారు.

గత ప్రభుత్వంలో సుందరీకరణ

గత ప్రభుత్వం నాడు- నేడులో భాగంగా పాఠశాలకు ఓ రూపు తెచ్చింది. శిథిలావస్థకు చేరిన గదులను సుందరీకరించింది. బాలికల కోసం చక్కటి మరుగుదొడ్లు, డిజిటల్ బోధన అందుబాటులోకి తెచ్చింది. సైన్స్ ల్యాబ్‌తో పాటు అదనపు గదులు నిర్మించింది. అయినా పలు సమస్యలు వెంటాడుతున్నాయి. ఇరుకైన స్థలంలో ప్రైమరీతో పాటు ఉన్నత పాఠశాల నిర్వహించడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.



ప్రాథమిక పాఠశాలను తరలిస్తే సమస్యకు చెక్

ఈ పాఠశాలను ఇరుకైన స్థలంలో నిర్వహించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. వసతి సమస్యను దృష్టిలో పెట్టుకుని ప్రైమరీ పాఠశాలను ఇదే వార్డు పరిధి గుల్లలపాలెం ప్రాథమిక పాఠశాలకు తరలిస్తే ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అవసరమైన గదులు లభిస్తాయి. లైబ్రరీ,స్టాఫ్ రూమ్ వంటి సదుపాయాలు కలుగుతాయని అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కదం తొక్కిన కోరమాండల్ ఉద్యోగులు



సంస్థ ఆవరణలో కవాతు నిర్వహిస్తున్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

మల్కాపురం: కోరమాండల్ పర్మినెంట్ ఉద్యోగుల వేతన సమస్య పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.గజపతిరావు ఆవేదన వ్యక్తం చేశారు.వేతనాల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పర్మినెంట్ ఉద్యోగులు కర్మాగారం మొదటి గేటు నుంచి మెయిన్ గేటు వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గజపతిరావు మాట్లాడుతూ కార్మికులకు సంబంధించిన చార్ట్ ఆఫ్ డిమాండ్స్ జూన్ 30వ తేదీన యాజమాన్యానికి ఇవ్వడం జరిగిందన్నారు. వేతన ఒప్పందంపై అగ్రిమెంట్ గతేడాది నవంబర్ 1న ప్రారంభం కావాల్సి ఉందన్నారు.కానీ నేటికీ దీనిపై యాజమాన్యం కనీసం స్పందించకపోవడం దారుణం అన్నారు.సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు.అయినా కార్మికులను యాజమాన్యం గుర్తించడం లేదన్నారు.



గేటు బయట సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు గజపతిరావు

యాజమాన్యం తీరును నిరసిస్తూ కార్మికులు సెప్టెంబర్‌లో వారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపినా, మాస్కులు ధరిస్తూ నిరసనలు తెలుపుతున్నా కనీసం స్పందించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా యాజమాన్యం తన తీరు మార్చుకొని కార్మికులకు మేలు జరిగే విధంగా ఆలోచన చేయాలని.. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.శ్రీనివాస్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు అంత్యక్రియలు

సింధియా: పెంపుడు కుక్కకు సంప్రదాయ బద్ధంగా దహన సంస్కారాలు చేసి జంతు ప్రేమను నిరూపించుకున్నారు ఆ కుటుంబ సభ్యులు. దానికి సంబంధించిన వివరాలు.. జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో నివాసముంటున్న చంద్రశేఖర్‌కు 2019లో శ్రీహరిపురం ప్రాంతంలో ఓ కుక్క రోడ్డుపై దొరికింది. పారువా వైరస్ సోకడంతో దాన్ని యజమాని రోడ్డుపై వదిలేశాడు. దీంతో చంద్రశేఖర్ ఆ శునకాన్ని ఇంటికి తీసుకువచ్చి రాఖీ అనే పేరు పెట్టి ప్రేమానురాగాలతో పెంచాడు. అయితే 10 రోజుల కిందట రాఖీకి ఫీవర్ రావడంతో ఆదివారం ఒక్కసారిగా ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. వెంటనే పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లగా ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని వైద్యులు సూచించారు. దీంతో చంద్రశేఖర్ ఆ విషయాన్ని స్నేహితులతో పాటు బంధువులకు తెలిపాడు. సోషల్ మీడియాలో తెలపగా సోమవారం రాఖీకి ప్లేట్‌లెట్స్ దానం చేయడానికి మరో పెంపుడు కుక్క యజమాని ముందుకు వచ్చారు. దీంతో సోమవారం వైద్యుల పర్యవేక్షణలో రాఖీకి ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. సోమవారం సాయంత్రం ఇంటికి తీసుకు వచ్చాక ఒక్కసారిగా కుప్పకూలిపోయి మరణించింది. దీంతో చంద్రశేఖర్ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. పెంపుడు రాఖీకి హిందూ ఆచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి మూగజీవంపై ఉన్న ప్రేమను మరోసారి చాటుకున్నారు.



పెంపుడు కుక్క రాఖీని ఖననం చేస్తున్న చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల

మల్కాపురం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండడం ద్వారా ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఆలయాలను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత 61వ వార్డు ఆర్‌కేపురంలోని గౌరీపరమేశ్వర్వుల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రకాష్‌నగర్‌లోని గౌరీపరమేశ్వరుల ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ,ఎంఐజీ క్వార్టర్స్ ఆవరణలోని హరిహర క్షేత్రంలోని నిర్వహించిన కోటి దీపారాధనోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట కార్పొరేటర్లు పి.వి.సురేష్,కొణతాల సుధ, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, నాయకులు గులిగిందల కృష్ణ, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రాయపురెడ్డి అనీల్‌కుమార్,ఆడారి హరీష్,గులిగిందల కృష్ణ,మళ్ల శివ,శ్యామ్‌కుమార్‌రెడ్డి,దొడ్డి సతీష్,భీశెట్టి భూపతి, బుజ్జి తదితరులు ఉన్నారు.



గౌరీపరమేశ్వరులను దర్శించుకుంటున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

రైతు బజార్‌లో సందడిగా వన భోజనాలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం రైతుబజార్‌లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.రైతు బజార్ ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు ఆధ్వర్యంలో ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంతా కలసి వనభోజనాలు చేశారు.రైతులు, దుకాణదారులు రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. దీనిలో భాగంగా సంగీత కచేరి కూడా ఏర్పాటు చేశారు. ప్రతీ ఏటా ఇదే మాదిరిగా కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నామని ఈవో వరహాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ హాజర య్యారు. సహాయకుడు ప్రతాప్, నాయకులు వాసు దేవరావు,కేబుల్ నాయుడు, సూర్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు



భోజనాలు వడ్డిస్తున్న రైతులు

ఎలక్ట్రికల్ రంగంలో ఉపాధి అవకాశాలు

మురళీనగర్ : ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలున్నాయని అదానీ గంగవరం పోర్టు ఎలక్ట్రికల్ విభాగం డీజీఎం కె.సతీష్ కుమార్ అన్నారు. కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం 5వ సెమిస్టర్ విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించాలంటే సబ్జెక్టుపై పట్టు సాధించడంతో పాటు సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. ప్రవీణ్‌బా ఎలక్ట్రికల్ ట్రైనింగ్ సర్వీసెస్, ఓడిస్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహించారు. శిక్షణ విభాగం ట్రైనర్ టి.రవిచంద్రన్ విద్యార్థులకు ఎలక్ట్రికల్ విభాగంలో ఉన్న అవకాశాలు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కాలేజీ ఎలక్ట్రికల్ విభాగం హెడ్ కేడీవీ నరసింహారావు, కె.మహేష్, పి.కిషోర్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీజీఎం సతీష్‌కుమార్

సీఐటీయూ సభ జయప్రదం చేయండి

సీతమ్మధార: ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం చేపట్టనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కేఎస్‌వీ కుమార్, జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ సోమవారం కోరారు. అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నవంబర్ 26న భారీ ఎత్తున నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. మంగళవారం దొండపర్తి రైల్వే డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో కార్మిక వర్గం భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించకుండా సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికులకు నష్టం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. ఆందోళనలో కార్మికులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మార్మోగిన శివ నామస్మరణ



శివలింగానికి పూజలు చేస్తున్న అర్చకులు



కోటి దీపోత్సవం పూజల నిర్వహణ



పూజల్లో పాల్గొన్న భక్తులు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

మల్కాపురం: కార్తీక మాసం నాలుగో సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే ఆలయాల ఎదుట క్యూ కట్టారు. హర నామస్మరణలో తరించారు. ధ్వజస్తంభాల వద్ద భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు.

- స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి ఆలయ అర్చకులు బిల్వపత్రాలు, విభూది,పంచామృతాలతో అభిషేకాలు చేశారు.
- మల్కాపురం రెడ్డివీధి వద్ద గల శివాలయంలో,ప్రకాష్‌నగర్,శ్రీహరిపురం,గుల్లలపాలెం,నక్కవానిపాలెం ప్రాంతాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

హరిహర క్షేత్రంలో దీపకాంతులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని హరిహర క్షేత్రంలోకార్తీక మాస అనంత దీపోత్సవం (కోటి దీపోత్సవం) పూజలు సోమవారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. గుల్లలపాలెం ఎంఐజీ కాలనీ పరిధిలోని మహిళలు దీపోత్సవంలో పాల్గొని ఆ మహాశివుని నామాన్ని స్మరిస్తూ కోటి దీపాలు వెలిగించారు. పలువురు మహిళలు కోలాట ప్రదర్శన చేశారు.శ్రీమాన్ కాండూరి వెంకట రమణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కంచరపాలెం: జీవీఎంసీ 56,57వ వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామ్మూర్తిపంతులపేట రామలింగేశ్వరాలయంలో వేకువ జాము నుంచే భక్తులు అభిషేకాలు చేశారు. కె.కాలనీ సాంబమూర్తినగర్‌లో చంద్రమౌళీ పార్వతీ ఆలయంలో అర్చకుడు పి.రాజేష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు.



సాంబమూర్తినగర్ ఆలయంలో పూజలు ..

- గవరకంచరపాలెం లోని గౌరీ శంకరాలయం, తుమ్మడపాలెం ఆత్మలింగేశ్వర ఆలయంలో తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి భక్తుల రద్దీ నెలకొంది. సాయంత్రం ధ్వజ స్తంభాల వద్ద దీపారాధన చేశారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు

విశాఖ విద్య: కార్తీక మాసం నాలుగో సోమవారం పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఎన్ఏడీ ఫ్లైఓవర్ వద్ద గల ప్రమథ ఉమావిశ్వేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు.

- జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడాలేఅవుట్‌ని వరసిద్ధి వినాయక ఆలయంలో కార్తీక పూజలు వైభవంగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.సూర్యనారాయణ, వైస్ చైర్మన్ పసాద్ రెడ్డి, కార్యదర్శి శంకరరావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీష శివప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

జీవీఎంసీ 90వ వార్డు సుసర్ల కాలనీలోని పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో పంచామృతాలతో స్వామికి అభిషేకం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర ఇచ్చారపు, శ్రీనివాసరాజు, సభ్యులు హరి శంకర్, సూర్యనారాయణ, భరత్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా గోపాలపట్నం, చంద్రానగర్, నాగేంద్రనగర్ కాలనీల్లోని శివాలయాల్లో కార్తీక పూజలు ఘనంగా జరిగాయి.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలి



అర్జీదారు నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జోన్ – 5 జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆదేశించారు. జ్ఞానాపురంలోని కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో పలు సమస్యలపై ఆరుగురి నుంచి ఆయన నేరుగా వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 03, రెవెన్యూకి 02, వాటర్ వర్క్స్‌కు సంబంధించి ఒక వినతి అందినట్లు తెలిపారు. జోన్ పరిధిలోని టౌన్ ప్లానింగ్‌పై అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయని, వార్డు పర్యటనలోనూ ఇదే విభాగానికి సంబంధించి సమస్యలు కనిపిస్తున్నాయని ఏసీపీ, టీపీవోలు పర్యవేక్షించాలని జెడ్సీ సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవో ఎస్.పుణ్యవతి, ఏఈలు సుమన్, సతీష్ పాల్గొన్నారు.